క్లుప్తంగా

అభయాంజనేయ స్వామికి పూజలు



అభయాంజనేయ స్వామిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యానారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు

బిక్కవోలు: ఊలపల్లిలోని శెట్టి బలిజపేట వద్ద అభయ ఆంజనేయ స్వామిని సోమవారం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యానారాయణ రెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు దర్శించుకున్నారు. గ్రామంలో 32 అడుగుల అభయ ఆంజనేయ స్వామి భారీ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం భారీ ఎత్తున అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు విశేషంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలోని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పోతల ప్రసాద్‌రెడ్డి, శెట్టిబలిజ సభ్యులు, ఆంజనేయ స్వామి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పరవాసుదేవుడి విగ్రహ ప్రతిష్ఠ



పుట్టకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రతిష్ఠించిన పరవాసుదేవుడు, అల్వార్ల విగ్రహాలు

పెదపూడి: పుట్టకొండలో ప్రసిద్ధి చెందిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం ఉదయం 9.24 గంటలకు పరవాసుదేవులు, అల్వార్ల విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పీపీ అనంతాచార్యుల ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు గోపాలాచార్యులు, మరో 30 మంది వైష్ణవ సంప్రదాయ పండితులు విగ్రహ ప్రతిష్ఠ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు, గ్రామస్తులు ప్రతిష్ఠ పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వడ్డాది సత్యనారాయణ, సర్పంచ్ వల్లు వెంకటరమణ పాల్గొన్నారు.

చంద్రశేఖరస్వామికి ప్రత్యేక పూజలు

రంగంపేట: మండల పరిధిలోని చంద్రేడులో కొలువైయున్న శ్రీ కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామి ఆలయంలో స్వామివారికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని సుందరంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమంలో పాల్గొన్న వినయ్ తేజ తదితరులు

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. దీని నిర్మాణానికి కంటే వీర్రాజు చారిటబుల్ ట్రస్టు అధినేత, వైఎస్సార్‌సీపీ నాయకుడు కంటే వినయ్ తేజ – సువర్ణ సుప్రియ రూ.5 లక్షలు విరాళం అందజేశారు. ఈ నగదును ఆలయ కమిటీకి అందజేశారు. శంకుస్థాపన సందర్భంగా పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు ఉదయం వాస్తు హోమం, గణపతి హోమం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

సారా కేసులో మహిళ అరెస్ట్

పెదపూడి: అనపర్తి మండలం పీరా రామచంద్రపురంలో సారా విక్రయిస్తున్న మహిళను అరెస్ట్ చేసి కోర్టుకు తరలించగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్సై శ్రీను నాయక్ తెలిపారు. ఆయన సోమవారం తెలిపిన వివరాల ప్రకారం తమకు అందిన సమాచారం మేరకు సిబ్బంది కలసి దాడి చేయగా 20 లీటర్ల సారా విక్రయిస్తూ సీత అనే మహిళ పట్టుబడిందన్నారు. ఆమె వద్ద ఉన్న సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసి అనపర్తి కోర్టుకు తరలించగా రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు ప్రారంభం



పెదపూడి జీఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో పదో తరగతి విద్యార్థులు



తల్లి సాయంతో రాజానగరంలోని పరీక్ష కేంద్రానికి వచ్చిన దివ్యాంగురాలు



బలభద్రపురం పరీక్ష కేంద్రం వద్ద రూమ్ నంబర్ చూసుకుంటున్న విద్యార్థులు

రాజానగరం: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. పరీక్షల నిర్వహణ కోసం నియోజకవర్గంలోని మూడు మండలాల్లో 3,131 మంది విద్యార్థుల కోసం 18 సెంటర్లను ఏర్పాటు చేశారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష కొనసాగాయి. పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు నిర్ణీత సమయానికే చేరుకున్నారు. పోలీసులు నిశితంగా తనిఖీలు చేసి, విద్యార్థులను పరీక్ష గదిలోకి పంపించారు. రాజానగరం మండలంలో రాజానగరం, నరేంద్రపురం, తోకాడ, కానవరం, దివాన్‌చెరువు, సంపత్‌నగరం ఉన్నత పాఠశాలలోపాటు దివాన్‌చెరువులోని సూర్య గ్లోబల్ స్కూల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ ఏడు కేంద్రాల్లో 1,184 మంది విద్యార్థులు పరీక్షలు రాయవలసి ఉండగా మొదటిరోజున ఐదుగురు వివిధ కారణాలతో గైర్హాజరయ్యారని మండల విద్యాశాఖాధికారులు రామన్నదొర, జ్యోతిప్రసాద్ తెలిపారు. ప్రతి కేంద్రం వద్ద తాగునీటితోపాటు హెల్త్ డెస్క్‌లను ఏర్పాటు చేసినట్టు ఎంఈవోలు తెలిపారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు

బిక్కవోలు: మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతగా జరిగాయి. సోమవారం మండలంలోని బిక్కవోలు, పందలపాక, బలభద్రపురం, ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మూడు కేంద్రాల్లోనూ పరీక్ష నిర్వహించారు. తొలిరోజు కావడంతో బిక్కవోలు విద్యార్థులు పాఠశాల పక్కనే ఉన్న శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో స్వామివారిని దర్శించుకుని అనంతరం పరీక్ష కేంద్రానికి వచ్చారు. మండల వ్యాప్తంగా రెగ్యులర్ విద్యార్థులు 578 మంది పరీక్షకు హాజరు కావాల్సిండగా 569 మంది హాజరయ్యారు. తెలుగు సబ్జెక్టు మాత్రమే రాయాల్సిన తొమ్మిది మందిలో కేవలం ఇద్దరు మాత్రమే హాజరయ్యారన్నారు. బిక్కవోలు కేంద్రంలో 185 మందికి 183 మంది, పందలపాక కేంద్రంలో 241 మందికి 236 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. బలభద్రపురం పరీక్ష కేంద్రంలో 152 మందికి 150 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు బిక్కవోలు ఎంఈవో–1 సీహెచ్ సత్యనారాయణ తెలిపారు.

770 మంది పరీక్షకు హాజరు

పెదపూడి: మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా సోమవారం జరిగాయని ఎంఈఓ–1,2 కె.సత్యనారాయణ, సీవీవీ సత్యనారాయణ తెలిపారు. మండలంలోని పెదపూడి, జి.మామిడాడ గ్రామాల్లో పరీక్షా కేంద్రాలను వారు సందర్శించారు. పెదపూడి పరీక్ష కేంద్రంలో 251 మందికి 250 మంది, జి.మామిడాడ బాలికల ఉన్నత పాఠశాలల్లో 136 మందికి 135 మంది, సంపర జెడ్పీ ఉన్నత పాఠశాలలో 153 మంది, జి.మామిడాడ బాలుర ఉన్నత పాఠశాలలో 132, మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారయ్యారు. మొత్తం 772 మందికి 770 మంది పరీక్ష రాసారు. వీరిలో 403 మంది బాలురు, 367 మంది బాలికలు ఉన్నారన్నారు. ఈ కేంద్రాలను ఎస్సై రామారావు పరిశీలించి పోలీసు బందో బస్తు నిర్వహించారు.

అనపర్తి మండలంలో

పెదపూడి: అనపర్తి మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా సోమవారం జరిగాయి. మండలంలో నాలుగు పరీక్షా కేంద్రాల్లో 832 మందికి 823 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 9 మంది గైర్హాజరయ్యారు. అనపర్తిలో బాలుర ఉన్నత పాఠశాల్లో 329 మందికి 325 మంది, బాలికల ఉన్నత పాఠశాల్లో 227 మందికి 224 మంది, కుతుకులూరు ఉన్నత పాఠశాల్లో 175 మందికి 173, లక్ష్మీనరసాపురం సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ పాఠశాల్లో 101 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. అన్ని ఏర్పాట్లు చేసి పర్యవేక్షించామని మండల విద్యాశాఖాధికారులు తెలిపారు.

రంగంపేట మండలంలో..

రంగంపేట: మండలంలోని మూడు కేంద్రాల్లో పది పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. రంగంపేట, వడిశలేరు, సింగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం తెలుగు పరీక్ష జరిగినట్టు మండల విద్యా శాఖాధికారి పి.మధుసూధనరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు కేంద్రాల్లో మొత్తం 587 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా, 586 మంది హాజరుకాగా ఒకరు గైర్హాజరయ్యారని తెలిపారు. రంగంపేటలో 220 మందికి 220, వడిశలేరులో 183 మందికి 183, సింగంపల్లిలో 184 మందికి 183 మంది పరీక్షలు రాసినట్టు ఎంఈవో తెలిపారు.

602 మందికి 595 మంది హాజరు

సీతానగరం: మండలంలోని పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే 602 మంది విద్యార్థులకు 595 మంది పరీక్షలకు హాజరయ్యారని ఎంఈవో కె.స్వామినాయక్ సోమవారం తెలిపారు. వెదుళ్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ పరీక్షా కేంద్రంలో 160 మంది, రఘుదేవపురం జిల్లా పరిషత్ హైస్కూల్లో 180 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. సీతానగరం ప్రభుత్వ హైస్కూల్ సెంటర్‌లో 113 మందికి 111 మంది, చినకొండేపూడి సూర్యచంద్ర సెంటర్‌లో 149 మందికి 144 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. ఏడుగురు విద్యార్థులు పరీక్షలకు హాజరు కాలేదని ఎంఈవో వివరించారు.

కోరుకొండ మండలంలో..

మధురపూడి: కోరుకొండ మండలంలో పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. మండలంలో 7 పరీక్ష కేంద్రాల్లో జరిగిన పరీక్షల్లో 1,220 మంది పరీక్షలు రాశారు. 10 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మండలంలో కోరుకొండ జిల్లా పరిషత్ పాఠశాలలో రెండు కేంద్రాలు, శ్రీరంగపట్నం, గాదరాడ, గాడాల, దోసకాయలపల్లి ప్రభుత్వ పాఠశాలలతో పాటు, చెరుకూరి హైస్కూల్లో 1,220 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు.

ఘనంగా సీతా సమేత శ్రీరామచంద్రమూర్తి విగ్రహాల ప్రతిష్ఠ



పందలపాకలో ప్రత్యేక అలంకరణలో సీతా సమేత శ్రీరామచంద్రమూర్తి

బిక్కవోలు: పందలపాక గ్రామంలోని నూతన నిర్మించిన రెడ్ల రామాలయంలో సోమవారం ఉదయం 10.22 గంటలకు సీతా సమేత శ్రీరామచంద్రమూర్తి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ విగ్రహ ప్రతిష్ఠలో గణపతి, సీతారాములు, లక్ష్మణుడు, ఆంజనేయ, సరస్వతి, శ్రీద్వార పాలక విగ్రహాలతోపాటు ధ్వజ స్తంభాన్ని, శిఖరాన్ని ప్రతిష్ఠించారు. ఈ ప్రతిష్ఠ పూజల్లో దంపతులు మాజీ సర్పంచి కొవ్వూరి గోపాలకృష్ణారెడ్డి, కరుణావతి దంపతుల పాటు వారి కుటుంబ సభ్యులు, పడాల సుబ్బిరెడ్డి, రజిని దంపతులు, గొలుగూరి సత్తిరెడ్డి, పద్మావతి, గొలుగూరి కృష్ణారెడ్డి దేవి దంపతులు పాల్గొన్నారు. అనంతరం స్వామి, అమ్మవార్లను సుందరంగా అలంకరించి కల్యాణం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు, టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్ రెడ్డి, స్వామివారిని దర్శించుకున్నారు. పండిత సత్కారం అనంతరం భక్తులకు భారీ అన్నసమారాధన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భక్తులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లో నిధుల గల్లంతుపై విచారణ



వెదుళ్లపల్లి పీఏసీఎస్‌లో రికార్డులను పరిశీలిస్తున్న అసిస్టెంట్ రిజిస్ట్రార్ కృష్ణమోహన్, విచారణాధికారులు

సీతానగరం: వెదుళ్లపల్లి సహకార సంఘంలో అవినీతిపై విచారణ కొనసాగుతోంది. సోమవారం సహకార రిజిస్ట్రార్ ఎం.కృష్ణమోహన్‌తోపాటు విచారణాధికారులు శివకుమార్, సుబ్బారావు విచారణ నిమిత్తం రికార్డుల పరిశీలించారు. గతేడాది సెప్టెంబర్లో వెదుళ్లపల్లి సహకారం సంఘంలో రూ.64 లక్షలు అవినీతిని ‘సాక్షి’లో ‘పీఏసీఎస్‌లో రూ.56 లక్షల గల్లంతు’ శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు విచారణ చేపట్టి, సంఘం సీఈవో సురేంద్ర, గుమస్తా పోశియ్య, ఎరువుల సేల్స్ ఉమెన్ భారతిని సస్పెండ్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్ కృష్ణమోహన్ మాట్లాడుతూ ఇప్పటి వరకు నిర్వహించిన విచారణలో రూ.64 లక్షలు అవినీతి జరిగినట్లు గుర్తించి, రూ.57 లక్షలు రికవరీ చేసినట్టు అధికారులు తెలిపారు. మిగిలిన రూ.7 లక్షలతో పాటు ఇంకా రసీదులు ఇవ్వకుండా తీసుకున్న సొమ్ములు, తప్పుడు రసీదులు ఇచ్చినవి తేలవలసి ఉందని, విచారణ కొనసాగుతుందన్నారు. రికవరీ చేయవలసిన నగదు జమ చేయకపోతే సివిల్, క్రిమినల్ కేసులు పెట్టి వసూలు చేస్తామని అసిస్టెంట్ రిజిస్ట్రార్ కృష్ణమోహన్ తెలిపారు.

సిద్ధి వినాయకుడికి పెన్నులతో పూజ



సంపరలో పెన్నులు, కొబ్బరికాయలతో ప్రత్యేక అలంకరణలో సిద్ధి వినాయకుడు

పెదపూడి: సంపర గ్రామంలో పంట కాలువ వద్ద వేంచేసియున్న సిద్ధి వినాయకస్వామి ఆలయంలో సోమవారం 10,000 పెన్నులు, 1,116 కొబ్బరి కాయలతో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. సంకటహర చతుర్థి సందర్భంగా బోడా వీర రాఘవులు కామేశ్వరి దంపతులు వారి కుమారుడు శ్రీనివాసరావు స్వామి వారికి పెన్నులు, కొబ్బరి కాయలతో పూజ చేసి మొక్కు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యుల ఆధ్వర్యంలో పది మంది పండితులు స్వామి వారికి పంచామృభిషేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో విద్యార్థులు, భక్తులు హాజరై పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులు, విద్యార్థులకు పెన్నులు, కొబ్బరికాయ చెక్క ప్రసాదం అందజేశారు.

వెదురుతో ఆధునిక ఉత్పత్తులు ఆవిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు మూర్తి

రాజానగరం: వెదురును పురాతన పద్ధతిలో వినియోగించే దశ నుంచి ఆధునిక కాలానికి అనుగుణంగా ఉపయోగపడే వివిధ రకాల ఉత్పత్తులను ఆవిష్కరించే దిశగా నైపుణ్యాలను పెంచుకోవాలని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు బీఎస్ఎన్ మూర్తి రైతులు, వ్యాపారులకు సూచించారు. లాలాచెరువులోని ప్రాంతీయ అటవీ శాఖ కార్యాలయంలో వెదురు సాగు విస్తీర్ణాన్ని పెంచడంపై ఔత్సాహికులతో సోమవారం సదస్సును నిర్వహించారు. సమాజంలో వెదురు ఉత్తత్తులకు ఉన్న ప్రాధాన్యతను గుర్తించి, సాగును చేపట్టడంతోపాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి ఉత్పత్తులు తయారు చేయాలన్నారు. రాబోయే రోజుల్లో వెదురు సాగుపై విస్తతంగా ప్రచారాన్ని, చైతన్యాన్ని తీసుకువచ్చే విధంగా గ్రామస్థాయిలో సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ఏపీ స్టేట్ ఫారెస్టు అకాడమీ డైరెక్టర్ విజయకుమార్ మాట్లాడుతూ వెదురును ఒక చెట్టు జాతిగా పరిగణించడం వల్ల రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం చట్ట సవరణ ద్వారా దీనిని గడ్డి జాతుల్లోకి చేర్చిందన్నారు. వెదురు సాగును ప్రోత్సహించే విధంగా జాతీయ వెదురు మిషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. కాన్ బేక్ కంపెనీ చైర్మన్ సంజీవ్ శశికాంత్ తన అనుభవాలను వివరించారు. 22 మందితో ప్రారంభమైన కంపెనీ నేడు పది వేల మంది కార్మికులకు ఉపాధిని కల్పిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి రవీంద్రధామ, ఆర్.శ్రీనివాస్, ఉద్యానవన శాఖ అధికారి డి. సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

చాంపియన్‌షిప్ ట్రోఫీ జీఎస్ఎల్ విద్యార్థుల కైవశం



చాంపియన్‌షిప్ ట్రోఫీని అందుకున్న జీఎస్ఎల్ విద్యార్థులు

రాజానగరం: డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పరిధిలో నిర్వహించిన 26వ గేమ్స్ మీట్‌లో జీఎస్ఎల్ వైద్య కళాశాల ఓవరాల్ చాంపియన్‌షిప్ ట్రోఫీని కైవసం చేసుకుందని ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. గన్నవరం సమీపంలోని సిద్ధార్థ పిన్నమనేని వైద్య కళాశాల ఈనెల 11 నుంచి 17 వరకు నిర్వహించిన పోటీల్లో ఈ ట్రోఫీని అందుకున్నారన్నారు. బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, కబడ్డీలో విన్నర్, టెన్నిస్‌లో రన్నర్‌గా నిలిచిన జీఎస్ఎల్ విద్యార్థులు టేబుల్ టెన్నిస్, బాస్కెట్ బాల్ పోటీల్లో మూడో స్థానాన్ని పొందింది, మార్చ్‌పాస్ట్‌లో ప్రథమస్థానంలో నిలిచారన్నారు. ఈ సందర్భంగా విజేతలను పలువురు అభినందించారు.

నాణ్యమైన కోకో సాగుతో అధిక ఆదాయం

మధురపూడి: అంతర పంటల్లో ప్రధానమైన కోకో సాగులో నాణ్యతా ప్రమాణాలు పాటించడం ద్వారా అధిక ఆదాయాన్ని ఆర్జించవచ్చని ఉద్యానవన శాఖ మండలాధికారిణి అన్నారు. శుక్ర, శని, సోమవారాల్లో నిడిగట్ల, మధురపూడి, దోసకాయల పల్లి తదితర గ్రామాల్లోని కోకో సాగు చేస్తున్న రైతులను ఆమె కలిసారు. కోకో పంట సాగును పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. అంతర పంట అయిన కోకో సాగు ద్వారా నిలకడగా ఆదాయాన్ని ఆర్జించవచ్చన్నారు. జూన్, జులై నెలల్లో కొమ్మలు కత్తిరించి, చెట్టును గొడుగు ఆకారంలో ఉండేలా చూడాలన్నారు.

నూరు శాతం పన్నుల వసూలు అభినందనీయం



జి.మామిడాడలో సచివాలయం కార్యదర్శులను సన్మానిస్తున్న ఈఓపీఆర్డీ సత్యనారాయణరెడ్డి

పెదపూడి: జి.మామిడాడ గ్రామ సచివాలయం వద్ద మండలంలో ఐదు గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నులు, ఇతర పన్నులు నూరు శాతం వసూళ్లు పూర్తి చేసిన కార్యదర్శులకు అభినందన సత్కార కార్యక్రమం సోమవారం నిర్వహించారు. 2024–2025 సంవత్సరానికి సంబంధించి పెద్దాడ, కరకుదురు, కుమారప్రియం, ఏపీత్రయం, రాజుపాలెంలో పన్నుల వసూళ్లు నూరుశాతం పూర్తి చేసిన కార్యదర్శులు మన్యం శ్రీనివాసు చౌదరి, భోగరాజు ప్రసన్న ఆంజనేయులు, సుంకర వీరస్వామి నాయుడు, తరుణ్, కె.విజయ్‌శేఖర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ మండలంలో 18 గ్రామ పంచాయతీలకు ఐదు గ్రామ పంచాయతీల్లో నూరుశాతం పన్నుల వసూళ్లు పూర్తి చేశారన్నారు. మిగిలిన పంచాయతీల్లో త్వరగా పన్ను వసూళ్లు పూర్తి చేయాలన్నారు. కుమారప్రియంలో రూ.1,37,856, కరకుదురులో రూ.8,24,086, రాజుపాలెంలో 2,87,286, ఏపీత్రయంలో రూ.5,86,112, పెద్దాడలో రూ.8,00,495, వసూళ్లు పూర్తి చేశారన్నారు. ఆ కార్యదర్శులకు శాలువా కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శి కనక నాగేంద్రకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంసీపీసీతో కేసుల సత్వర పరిష్కారం



శిక్షణ కార్యక్రమానికి జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రధాన న్యాయమూర్తి సునీత

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): మధ్య వర్తిత్వం, రాజీ ప్రాజెక్ట్ కమిటీ(ఎంసీపీసీ) ఆధ్వర్యంలో కేసుల సత్వర పరిష్కారానికి అవకాశం ఉందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో లీగల్ సర్వీసెస్ అథారిటీ సమావేశ మందిరంలో ఎంసీపీసీ ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీ వరకు ఐదు రోజుల పాటు జరిగే శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి సునీత మాట్లాడుతూ, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎంసీపీసీ ఆధ్వర్యంలో హైకోర్టు సూచనలతో మధ్యవర్తిత్వం రాజీ మార్గం అనే అంశంపై జ్యుడీషియల్ అధికారులకు, న్యాయవాదులకు అవగాహన, శిక్షణ అందిస్తున్నట్టు వివరించారు. ఇందులో భాగంగా ఎంసీపీసీ యాక్ట్ 2023 ప్రొవిజన్ ప్రకారం జ్యుడీషియల్ అధికారులకు, అడ్వకేట్లకు శిక్షణ అందిస్తామన్నారు. కోర్టు సంబంధిత కేసుల్లో పరిష్కారానికి నాలుగు విధానాలు ఉన్నాయన్నారు. ఇందులో మధ్యవర్తిత్వ రాజీ మార్గం, లోక్ అదాలత్ అంశాలుగా ఉన్నాయన్నారు. ఐదు రోజుల శిక్షణకు తగిన ఏర్పాట్లు చేశామన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఒక్క అర్జీ

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఒక అర్జీని అధికారులు అందుకున్నారు. సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎంపీడీవో ఎం.భారతి, తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ ఒక ఆర్జీని అందుకున్నారు. పంట పొలంలో ఉమ్మడిలో ఉన్న విద్యుత్ మోటారు సర్వీస్ పేరు మార్పు చేయవద్దని పురుషోత్తపట్నంకు చెందిన పరిమి మురళీ బాలకృష్ణ ఆర్జీని అందించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి వివిధ శాఖాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు

మధురం.. మధుసూదన్ గాత్రం

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నగరానికి చెందిన ప్రముఖ గాయకుడు శిష్టు మధుసూదనరావు గాత్రం శ్రోతలను అలరించింది. సోమ వారం శ్రీ త్యాగరాజ నారాయణ దాస సేవా సమితి 74వ వార్షికోత్సవాల్లో భాగంగా ఆయన ప్రముఖ వాగ్గేయకారులు త్యాగయ్య, ముత్తు స్వామి దీక్షితార్, మైసూర్ వాసుదేవా చారి, పొన్నై పిళ్ళై తదితరులు కీర్తనలను ఆయన ఆలపించారు. సమితి గౌరవాధ్యక్షుడు వాడ్రేవు వెంకటరమణ, చైర్మన్ చింతలూరి సుందర వెంకటరావు, ప్రధాన కార్యదర్శి జె.సరస్వతి, ఫంక్షనల్ కార్యదర్శి వి.భాస్కర్‌రామ్, ఇతర కార్యవర్గ సభ్యులు కళాకారులను సత్కరించారు. మధుసూదన్ గాత్రానికి హనుమంతు రామ్‌చరణ్ వయొలిన్, కోటిపల్లి సూరిబాబు మృదంగం, రాయప్రోలు బాల దినకర్ ఘటంపై సహకారం అందజేసారు. ఉమా నృత్య నికేతన్ కూచిపూడి నృత్య ప్రదర్శనతో మంగళవారం సంగీత వార్షికోత్సవాలు ముగియనున్నాయి.

పాఠశాలల్లోని ఆయాల జీతాలు పెంచాలి



ధర్నా చేస్తున్న ఆయాలు

రాజమహేంద్రవరం సిటీ: మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న పార్ట్ టైం కాంటింజెంట్ స్వీపర్లు (ఆయాలు) జీతాలు పెంచాలని సోమవారం రాజమహేంద్రవరం మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.పవన్ మాట్లాడుతూ ఆయాలకు ప్రభుత్వం కేవలం 4 వేలు జీతం అందించి వెట్టి చాకిరి చేయిస్తోందని ధ్వజమెత్తారు. 30 ఏళ్లుగా మున్సిపల్ పాఠశాలల్లో విద్యార్థులకు సేవలు అందిస్తున్న ఆయాలకు కనీస వేతనం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈఎస్ఐ అమలు చేయడంతోపాటు రెండు జతల యూనిఫాం, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఫుల్ టైమ్ కంటింజెంట్ వర్కర్స్‌గా వారిని గుర్తించి జీఓ 193 అమలు చేయాలన్నారు. ప్రతి నెలా 5వ తేదీలోపు జీతం చెల్లించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వర్కర్స్ జాన్సి, శాంతి, దుర్గ, సత్యవతి, ప్రభావతి, లక్ష్మి పాల్గొన్నారు.

బీజేపీ సహకారంతోనే రాష్ట్రాభివృద్ధి

సీతానగరం: బీజేపీ సహకారంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్రం అభిప్రాయపడ్డారు. సోమవారం కాటవరంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు గూటపాటి జయరాం ఆధ్వర్యంలో జిల్లా నాయకులు ఏపీఆర్ చౌదరి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర పాల్గొని మాట్లాడుతూ నియోజకవర్గంలో ముంపునకు గురవుతున్న పంట పొలాల సంరక్షణకు బొబ్బిల్లంక, మిర్తిపాడు లిఫ్టు ఇరిగేషన్ కోసం ఎంపీ పురందేశ్వరి దృష్టిలో ఉంచామన్నారు. పోలవరం ప్రాజెక్ట్ పూర్తయిన తర్వాత మండలం అభివృద్ధిలో పరుగులు పెడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెంకటలక్ష్మి, ఖండవల్లి సాయి, దాసరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు

యురేకా సైన్స్ ఎక్స్‌పోలో జిల్లాకు ప్రథమస్థానం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జనవిజ్ఞాన వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన యురేకా సైన్స్ ఎక్స్‌పో- 2025లో భాగంగా తూర్పుగోదావరి జిల్లాస్థాయి సైన్సు ప్రయోగ పోటీల్లో ప్రథమస్థానాన్ని కైవసం చేసుకుందని జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రవిబాబు సోమవారం తెలిపారు. పర్యావరణం సుస్థిర అభివృద్ధిలో ప్రథమ బహుమతిని సీతానగరం మండలం, రఘుదేవపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు కేభానుతేజ, కేసత్య దుర్గ, నాగేంద్రకుమార్ కైవసం చేసుకున్నారని తెలిపారు. ద్వితీయ బహుమతిని మున్సిపల్ హైస్కూల్ గాంధీపురం విద్యార్థులు కలిదిండి లహరి, కె.లతా జ్యోతికి దక్కాయని అన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీలో ప్రథమ బహుమతిని ఆనందనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వి.అనిరుథ్, ఎం.దివాకర్, పి.మహేష్, ద్వితీయ బహుమతి, గాంధీపురం మునిసిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పి.జ్యోతిలహరి, మండపరెడ్డి రమ్య దక్కించుకున్నారని అన్నారు. మూఢ నమ్మకాలు, శాస్త్రీయ దృక్పథం విభాగంలో గాంధీపురం మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మాజేటి వాసవ్, మండ జాయ్ విజయం సాధించారని తెలిపారు.

లైఫ్ స్కిల్స్‌లో విద్యార్థినులకు శిక్షణ

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): స్థానిక ఆర్ట్స్ కళాశాలలో ఈనెల 17 నుంచి 22వ తేదీ వరకు నాంది ఫౌండేషన్ మహీంద్రా ప్రైడ్ క్లాస్ రూమ్, స్కిల్ డెవలప్‌మెంట్ సహకారంతో శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే సోమవారం తెలిపారు. కళాశాలకు చెందిన విద్యార్థినులకు సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్‌లో శిక్షణ ఇస్తారన్నారు. కళాశాల స్కిల్ ట్రైనింగ్ కోఆర్డినేటర్ బి.వెంకటరావు మాట్లాడుతూ మొదటి బ్యాచ్‌గా 50 మంది విద్యార్థినులకు శిక్షణనిస్తామన్నారు. ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ నూజిళ్ల శ్రీనివాస్, శిక్షణకు ట్రైనర్‌గా వచ్చిన వి.చైతన్య విద్యార్థినులకు పలు అంశాలు వివరించారు. బి.వెంకటరావు రచించిన రెండు కెమిస్ట్రీ టెక్స్ట్ బుక్స్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్.కె ఆవిష్కరించారు. శిక్షణను స్కిల్స్ డెవలప్‌మెంట్ ట్రైనర్ పద్మావతి, ప్లేస్‌మెంట్ ట్రైనర్ ఎం.కిరణ్ కుమార్ పర్యవేక్షించారు.